సంక్షేమం, అభివృద్ధిపై నిరంతర పర్యవేక్షణ



ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ కేంద్రం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, న్యూస్‌టుడే: సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ప్రగతి పనుల పురోగతిని ప్రజలకు తెలియజేయాలన్నారు. లోక్‌సభ నియోజకవర్గానికి కేంద్రం నుంచి ఏటా రూ.5 కోట్లు మంజూరవుతాయని తెలిపారు. వీటిని ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్న ప్రాంతాల అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి నిధులు సద్వినియోగమయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రగతి పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించటానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకట మురళి, జేసీ ప్రఖర్ జైన్, సీపీవో శ్రీనివాసులు, ఆర్డీవో గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

22న ధర్నా విజయవంతం చేయండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : చేతి వృత్తిదారులకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ కార్యాలయాల వద్ద చేపట్టిన ధర్నా విజయవంతం చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు రాష్ట్రప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు, విష్ణుమొలకల శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లకు ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేయిస్తా: ఎంపీ తెన్నేటి

బాపట్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలయ్యే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి నిరుపేదకు అధికారులు అందించాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షక కమిటీ (దిశ) సమావేశాన్ని ఎంపీ అధ్యక్షతన కలెక్టరేట్లో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదగాలన్న లక్ష్యంతో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారని వివరించారు. పేదరిక నిర్మూలన, ప్రతి ఒక్కరికీ ప్రాథమిక వైద్యం, నాణ్యమైన విద్య, యువతలో నైపుణ్యాలు పెంపొందించి స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎంపీ ల్యాడ్స్ వినియోగంలో పారదర్శకత పాటించాలన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయన్నారు. 44 పథకాలకు కేంద్ర నిధులు వస్తున్నాయని తెలిపారు. జాబ్‌కార్డులు జారీ చేసి ఉపాధి కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన ఇళ్ల వివరాలు అధికారులు చెప్పకపోవటంపై ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.578 కోట్లు కేటాయిస్తే 40 శాతం పనులు కూడా ఎందుకు చేయలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు. కార్మికులు, చిరుద్యోగుల కోసం బాపట్లలో ఈఎస్ఐ ఆసుపత్రి ప్రారంభించటానికి కేంద్రం నుంచి అనుమతి మంజూరు చేయిస్తానన్నారు. గతంలో ఎంపీ ల్యాడ్స్ వినియోగంపై విజిలెన్స్ విచారణ చేయిస్తామన్నారు. కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ ఎస్టీలందరికీ జాబ్‌కార్డులు జారీ చేసి ఉపాధి కల్పించాలని ఆదేశించారు. 19 మండలాల్లో 19 వేల ఇంకుడు గుంతలు తవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఒక్కో ఇంకుడు గుంత తవ్వకానికి రూ.6 వేలు ఇస్తారన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ సమగ్ర విచారణ చేసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులకు మాత్రమే ఇవ్వాలన్నారు. అక్రమ పింఛన్లు ఏరివేయాలని పేర్కొన్నారు. పీవీపాలెం మండలంలో పండ్ల మొక్కలు నాటాలని కోరారు. డీఆర్వో సత్తిబాబు, ప్రకాశం, గుంటూరు జడ్పీ సీఈవోలు చిరంజీవి, జ్యోతిబసు అధికారులు పాల్గొన్నారు.

నకిలీలొస్తున్నాయ్ జాగ్రత్త!



కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఓ రైతు వరి పైరులో దోమల నియంత్రణకు ప్రముఖ కంపెనీ పేరు మీద ఉన్న పురుగుల మందు కొనుగోలు చేసి వాడారు. దోమల బెడద తగ్గకపోగా పంట దెబ్బతినడంతో వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. శాస్త్రవేత్తలు ఆ పైరును పరిశీలించి తేల్చిందేమంటే.. రైతు వాడింది నకిలీ పురుగు మందు.

ఈనాడు, బాపట్ల

మార్కెట్లో నకిలీ పురుగుమందులు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రత్యేకించి వరి రైతులు ఎక్కువగా వినియోగించే దోమల నివారణ మందులకు నకిలీవి సృష్టించి ప్రముఖ బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి తెస్తున్నారు. ఒక ప్రముఖ కంపెనీ దోమల మందు 94 మిల్లీ లీటర్ల సీసా ఖరీదు గరిష్ఠ చిల్లర ధర కన్నా తక్కువగా రూ. 1,220కు విక్రయిస్తున్నారు. ఈ మందు బాగా పని చేస్తుందన్న నమ్మకంతో రైతులు విరివిగా వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా ఈ కంపెనీని పోలిన డబ్బాలు తయారు చేసి నకిలీ మందును మార్కెట్లోకి తీసుకొచ్చారు అక్రమార్కులు.

హైదరాబాద్ కేంద్రంగా తయారీ

హైదరాబాద్ నగర శివార్లలో బయో ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలున్నాయి. వీటి మాటున కొంతమంది నకిలీలు తయారు చేసి మార్కెట్లోకి వదులుతున్నారు. ఇందుకోసం ప్రముఖ కంపెనీలకు చెందిన, భారీగా డిమాండ్ ఉన్న పురుగుమందుల డబ్బాలను పోలినవి వినియోగిస్తున్నారు. డబ్బాల్లో తేడా లేకపోవడం, ఎప్పుడూ కొనుగోలు చేసే దుకాణాల్లోనే వాటిని విక్రయిస్తుండడంతో రైతులకు అనుమానం రావడం లేదు. పైగా వీటిని ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఎక్కువగా విక్రయిస్తున్నారు. వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల నిఘా తక్కువ ఉండడమే దీనికి కారణం. ఈ నకిలీ మందులు హైదరాబాద్ నుంచి రెగ్యులర్ పార్సిల్ సర్వీసుల్లో కాకుండా శివారు ప్రాంతాలకు వివిధ సామగ్రి చేరవేసే ట్రాన్స్‌పోర్టు కంపెనీల ద్వారా గుంటూరు చుట్టుపక్కల పట్టణాలకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు సరఫరా అవుతున్నాయి.

దళారులదే హవా

పురుగుమందుల వ్యాపారంలో దళారుల ప్రమేయం ఎక్కువగా ఉంటోంది. ఉమ్మడి జిల్లాలో పత్తి, మిర్చి పంటల సాగు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విత్తనాలు, పురుగుమందుల వ్యాపారులెక్కువగా ఉన్నారు. పోటీ కారణంగా మార్జిన్‌ను పట్టించుకోకుండా ఒక్కొక్కరు ఒక్కో ధరకు విక్రయిస్తుంటారు. గుంటూరు కేంద్రంగా ఉన్న దళారులు.. ప్రముఖ కంపెనీలు ఇక్కడి వ్యాపారులకిస్తున్న ధరలతో, వేరే రాష్ట్రంలోని ధరలతో పోల్చి తక్కువకు వస్తున్న ప్రాంతాల నుంచి సరఫరా అయ్యేలా చక్రం తిప్పుతున్నారు. దీంతో రిటైల్ ధరలకొచ్చేసరికి కొంత తేడా ఉంటోంది. ఈ క్రమంలో డిమాండ్ ఉన్న పురుగుమందులకు నకిలీలు వస్తున్నాయి. వీటిని రైతులు గుర్తించలేక మోసపోతున్నారు. గడువు మీరిన మందులను మళ్లీ రీప్యాక్ చేసి విక్రయిస్తున్న ఘటనలూ ఉన్నాయి. గడువు సమయం సమీపించేకొద్దీ ధరలు తగ్గించి విక్రయిస్తున్న వ్యాపారులున్నారు.

ఇలా అడ్డుకోవచ్చు

ప్రముఖ కంపెనీల పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు డబ్బాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే అది ఒరిజనలా? కాదా? స్పష్టమవుతుంది. రైతులు ఆయా కంపెనీల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ పరిజ్ఞానం తెలియకపోతే వ్యాపారిని కచ్చితంగా స్కాన్ చేసి చూపించాలని కోరి నిర్ధారించుకున్న తరువాతే కొనుగోలు చేయాలి. నకిలీ డబ్బాలపైనా క్యూఆర్ కోడ్ ఉంటోంది. రైతులు తనిఖీ చేయగలిగితే మోసపోకుండా బయటపడొచ్చు.



1,29,600 క్యూసెక్కుల నీటి విడుదల

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయం 16 క్రస్టు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 1,29,600 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదికి విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,597 క్యూసెక్కులు వదులుతున్నారు. కుడి కాలువకు 6112, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 1,74,120 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం సాగర్‌లో 312.0450 టీఎంసీల నీరు ఉంది.

నగల వ్యాపారిని బెదిరించి రూ.39.50 లక్షల దోపిడీ

మేదరమెట్ల, న్యూస్‌టుడే: బంగారం కొనుగోలు చేసేందుకు వెళ్తున్న వ్యాపారిని బెదిరించి రూ.39.50 లక్షల నగదు అపహరించారు. ఈ సంఘటన కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన పల్లం స్వరూప్‌కు పట్టణంలో నగల దుకాణం ఉంది. అతను శుక్రవారం రాత్రి బంగారం కొనుగోలు చేసేందుకు తనకు తెలిసిన వెంకటరమణ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన కంటైనర్ లారీలో చెన్నైకు బయలుదేరారు. పి.గుడిపాడు సమీపంలోకి వచ్చేసరికి అకస్మాత్తుగా లారీకి కొందరు కారు అడ్డు పెట్టారు. లారీలో ఉన్న స్వరూప్‌ను బెదిరించి కారులో ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి తిమ్మనపాలెం సమీపంలోని గ్రోత్ సెంటర్ వరకు కారులో తీసుకెళ్లి అతని వద్ద ఉన్న నగదు బ్యాగ్‌ను తీసుకుని అదే కారులో పి.గుడిపాడు సమీపంలో వదిలివెళ్లారు. కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహమ్మద్ రఫీ వెల్లడించారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ తమిళనాడు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. 347 పాయింట్లు సాధించి తమిళనాడు రాష్ట్రం ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. పురుషుల, మహిళల ఛాంపియన్‌షిప్‌లను సైతం తమిళనాడే దక్కించుకుంది. ఈ పోటీల్లో అగ్రస్థానంలో తమిళనాడు నిలవగా.. తరవాత స్థానాల్లో కర్ణాటక, తెలంగాణ, ఏపీలు నిలిచాయి.

❖ అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలవగా. ఏపీ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. అండర్-16 బాలుర విభాగంలో తెలంగాణ, కర్ణాటక, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక, తమిళనాడు, అండర్-20 బాలుర విభాగంలో తమళనాడు, కర్ణాటక రాష్ట్రాలు నిలిచాయి.

❖ అండర్-14, అండర్ -16, అండర్ -18, అండర్ -20 బాలికల విభాగంలో తమిళనాడు, కర్ణాటకలే తొలి రెండు స్థానాలలో నిలిచాయి.

❖ వ్యక్తిగత విభాగంలో అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్, అండర్-16 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు ఆయుష్, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు దయానంద్, అండర్ -20 బాలుర విభాగంలో ఏపీ క్రీడాకారుడు షేక్ రోషన్ పతకాలు దక్కించుకున్నారు.

❖ అండర్-14 బాలికల విభాగంలో తమిళనాడు క్రీడాకారిణి ఆర్తి, అండర్-16 బాలికల విభాగంలో ఏపీ క్రీడాకారిణి డింపుల్ మహశ్రీ, అండర్ -18 బాలిక విభాగంలో కర్ణాటక క్రీడాకారిణి శృతిశెట్టి, అండర్-20 బాలికల విభాగంలో తమిళ క్రీడాకారిణి శ్రీవర్ధినికి పతకాలు వరించాయి. విజేతలకు భారత క్రీడా సమాఖ్య ఈసీ సభ్యురాలు హైమావతి, సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కిరణ్ బహుమతులు ప్రదానం చేశారు.

రాడార్ డాప్లర్ కేంద్రం ఏర్పాటేది?

న్యూస్‌టుడే, బాపట్ల

- 15ఏళ్లుగా ప్రతిపాదనలతోనే సరి
- విపత్తు వేళ నష్ట నివారణలో కీలకం

తుపానులు, వాయుగుండాల సమయంలో విశ్వసనీయమైన సమాచారంతో వేగంగా హెచ్చరికలు జారీ చేస్తే ప్రాణ, ఆస్తి నష్టం చాలా వరకు తగ్గుతుంది. బాపట్ల సమీపంలోని సూర్యలంకలో రాడార్ డాప్లర్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన దశాబ్దంన్నరగా నెరవేరలేదు. రాజధాని అమరావతికి సమీపంలో ఉన్న ఈ తీర ప్రాంతంలో డాప్లర్ కేంద్రం వస్తే విపత్తును సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.



వాతావరణ పరిశీలన కేంద్రం



వ్యవసాయ కళాశాల క్షేత్రంలో శాటిలైట్ కేంద్రం

❖ సూర్యలంకలో కీలకమైన వాయుసేన కేంద్రం ఉంది. దేశంలో తూర్పు తీరంలో వైమానిక దళానికి అత్యంత ముఖ్యమైన క్షిపణుల పరీక్ష కేంద్రం ఇది. ఏటా డిసెంబరు నుంచి ఫిబ్రవరి మధ్య స్థానిక వాయుసేన కేంద్రంలో క్షిపణుల పరీక్షలు నిర్వహిస్తారు. గాలి వేగం, పీడనం, ఉష్ణోగ్రత, వర్షపాతం, ఆర్ద్రత తదితర విషయాలు తెలుసుకోటానికి వాతావరణ పరిశీలన కేంద్రాన్ని బాపట్లలో ఏర్పాటు చేశారు. బాపట్ల, సూర్యలంకలో కచ్చితమైన వాతావరణ సమాచారం కోసం పుణెకు చెందిన ఐఎండీ ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల క్షేత్రంలో శాటిలైట్ కేంద్రం ఏర్పాటు చేసి సమాచారం సేకరిస్తున్నారు.

- ➻ జిల్లాలో తీర ప్రాంత పొడవు: 74 కి.మీ.
- ➻ తీర మండలాలు: ఎనిమిది
- ➻ నాలుగు దశాబ్దాల్లో సూర్యలంక తీరం సమీపంలో తీరం దాటిన తుపానులు: 03

❖ సూర్యలంక తీరంలో తుపానులు తీరం దాటుతున్నాయి. 2010 మే 20న లైలా, నిరుడు డిసెంబరు 4న మిగ్జాం తుపాను ఈ ప్రాంతంలో తీరం దాటాయి. తుపానుల గమనానికి సంబంధించి కీలకమైన సమాచారం ఇచ్చే రాడార్ డాప్లర్ కేంద్రాలు విశాఖ, మచిలీపట్నం, శ్రీహరికోటలో మాత్రమే ఉన్నాయి. ఒంగోలు-మచిలీపట్నం తీరాల మధ్య గతంలో నాలుగైదు తుపానులు తీరం దాటాయి. ఆ సమయంలో సమాచారం కోసం విశాఖ వాతావరణ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. 1977 నవంబరులో వచ్చిన దివిసీమ ఉప్పెనతో పెను విధ్వంసం, అపార ప్రాణనష్టం సంభవించింది.

❖ నిజాంపట్నంలో రూ.451 కోట్లతో హార్బర్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. చీరాల వాడరేవులో రూ.451 కోట్లతో హార్బర్ నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నారు. నిజాంపట్నం మండలం దిండిలో రూ.220 కోట్లతో ఆక్వా పార్కు ఏర్పాటు చేస్తున్నారు. వేల మంది మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి చేపల వేట సాగిస్తుంటారు. సముద్ర పరిస్థితులు, వాతావరణ సమాచారం వారికి సత్వరమే అందాల్సి ఉంది. సూర్యలంకలో రాడార్ డాప్లర్ కేంద్రం ఏర్పాటు చేస్తే అల్పపీడనం, వాయుగుండం, తుపానుల గమన సమాచారం వేగంగా తెలుస్తుంది. ఈ ప్రాంతంలో కేంద్రం ఏర్పాటైతే రాజధాని వాసులకు విపత్తుల సమాచారం కచ్చితత్వంతో పాటు వేగంగా అందుతుంది.

మంజూరుకు కృషి చేస్తా: ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

సూర్యలంక ప్రాంతంలో రాడార్ డాప్లర్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను కేంద్ర శాస్త్రసాంకేతిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులకు వివరిస్తా. ఈ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు, నిధుల మంజూరుకు కృషి చేస్తా.

బాల్య వివాహాల నిషేధంపై అవగాహన అవసరం



విద్యార్థినుల ప్రదర్శన

బాపట్ల, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిషేధంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్వో సత్తిబాబు అన్నారు. రోజ్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వాతంత్ర్యం కోసం నడక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల నుంచి చీలురోడ్డు కూడలి వరకు విద్యార్థినులతో కలిసి అధికారులు ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మాయిలను బాగా చదివించాలన్నారు. అక్రమ రవాణాపై డయల్ 1098, 181 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. చీలురోడ్డు కూడలిలో మానవహారంగా ఏర్పడి మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డీఈవో నారాయణరావు, ఐసీడీఎస్ పీడీ ఉమ, డీఎస్‌డబ్ల్యూవో రాజా దెబోరా, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు కృష్ణవేణి, రోజ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వేరుసెనగ విత్తనం అందించరూ!

చెరుకుపల్లి: మెట్ట ప్రాంతాల్లో అక్టోబరు నుంచి వేరుసెనగ సాగు ప్రారంభించే రైతులు ఈసారి సాగుపై వెనుకంజ వేస్తున్నారు. వేరుసెనగ సాగుకు అనుకూలమైన ఈ ప్రాంతంలో గతంలో దాదాపు నాలుగైదువేల ఎకరాల్లో వేరుసెనగ సాగయ్యేది. పంట సాగులో విత్తనం ఖర్చు వేలల్లో ఉంటుంది. ఎకరానికి క్వింటాలు విత్తనం అవసరమని వ్యవసాయశాఖ అధికారులు అంటుంటే ఇక్కడి రైతులు మాత్రం ఎకరానికి 1.5 క్వింటాళ్ల వరకు విత్తనం వేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ప్రస్తుతం క్వింటా విత్తనం రూ.12 వేలకు పైగా ఉంది. ఈ లెక్కన విత్తనానికే ఎకరానికి రూ.18వేలకు పైగా ఖర్చు కానుంది. గతంలో చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయశాఖ రాయితీపై వేరుసెనగ విత్తనాలను అందించేది. కొన్నేళ్లుగా రాయితీ విత్తనాలు అందకపోవటంతో చిన్న, సన్నకారు రైతులు విత్తనం కొనలేక తక్కువ పెట్టుబడి వ్యయం అయ్యే మినుము, పెసర సాగుకు మొగ్గుచూపుతున్నారు. విత్తనం ఖర్చు ఎక్కువైందని రాయితీపై విత్తనం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక రవాణాపై రగడ

రెండు గంటల పాటు నిలిచిన రాకపోకలు

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో పెసర్లంక సమీపంలో కృష్ణానది నుంచి రెండ్రోజులుగా ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణా రెండు గ్రామాలకు చెందిన వారి మధ్య శనివారం చిచ్చుపెట్టింది. ఫలితంగా కొల్లూరుకు చెందిన ఓ ట్రాక్టర్ యజమాని తన వాహనాన్ని నిత్యం రద్దీగా ఉండే కొల్లూరు లాకుల కూడలిలో రహదారిపై అడ్డుగా పెట్టడంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచాయి. రెండు వర్గాల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల రంగ ప్రవేశంతో ఉద్రిక్తతకు తెరపడడంతో పాటు రాకపోకలు యథావిధిగా సాగాయి. వివరాలు ఇలా.. పెసర్లంక సమీపంలో కృష్ణా నది నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసే ఇతర గ్రామాలకు చెందిన వారు ఒక్కో వాహనానికి రూ.500 చొప్పున తమ గ్రామంలో శివాలయం మరమ్మతుల నిమిత్తం చెల్లించాలని పెసర్లంకకు చెందిన కొందరు షరతు విధించారు. ఇందుకు నిరాకరించిన కొల్లూరుకు చెందిన కనపాలు బాబూరావు తన ట్రాక్టర్‌లో తెస్తున్న ఇసుకను పెసర్లంకలోనే పోసి నేరుగా వచ్చి లాకుల కూడలిలో రహదారిపై తన ట్రాక్టరును అడ్డుగా నిలిపాడు. దీంతో రాకపోకలు నిలిచి పోయాయి. కొల్లూరు చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులతో పాటు మరి కొందరు బాబూరావుకు మద్దతుగా నిలిచారు. విషయం తెలుసుకున్న పెసర్లంకకు చెందిన కొందరు లాకుల కూడలికి చేరుకున్నారు. ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బు వసూలు విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పాఠశాల నుంచి విద్యార్థులను ఇళ్లకు చేరవేసే బస్సులు, ఆర్టీసీ బస్సులతో పాటు పలు వాహనాలు ఇరువైపులా పదుల సంఖ్యలో నిలిచిపోయాయి. రెండు గంటల పాటు ఇదే పరిస్థితి కొనసాగింది. సమాచారం అందుకున్న ఎస్సై ఏడుకొండలు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి, రహదారికి అడ్డుగా నిలిపిన వాహనాన్ని తొలగించారు. పెసర్లంకకు చెందిన సాతా శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడంతో ఉద్రిక్తతకు తెరపడింది. రాకపోకలకు మార్గం సుగమమైంది. వాహనాలు నిలిచి పోవడం వల్ల విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.



లాకుల కూడలిలో రహదారిపై వాహనాలు అడ్డుపెట్టిన వారితో మాట్లాడుతున్న ఎస్సై ఏడుకొండలు

రాతి ముఖమండపం 60 శాతం పూర్తి

పనులు పరిశీలించిన డీఈ శ్రీనివాసరావు


దస్త్రాలు పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ డీఈ శ్రీనివాసరావు, ఈవో తిమ్మానాయుడు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండపం, విమాన శిఖరం నిర్మాణ పనులు ఇప్పటి వరకు 60 శాతం పూర్తయినట్లు గుంటూరు దేవాదాయ శాఖ ఉప ఇంజినీరు శ్రీనివాసరావు అన్నారు. రూ.6.85 కోట్ల అంచనా వ్యయంతో 2022 ఫిబ్రవరిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తితిదే రూ.2 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.మూడు కోట్లు, దాతల సహకారం రూ.కోటితో గ్రానైట్ రాళ్లు, మరో దాత సహకారం రూ.85 లక్షలతో విమాన శిఖరం నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆలయాన్ని సందర్శించిన డీఈ శ్రీనివాసరావు, ఏఈ మధుబాబు, సహాయ స్థపతి సురేంద్రతో పాటు సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు నిర్మాణ పనులు పరిశీలించారు. పనుల్లో రాజీపడకుండా, వేగంగా జరిగేలా చూడాలని కట్టుబడి మేస్త్రీకి సూచించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి గుడి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను డీఈ పరిశీలించారు. గుత్తేదారుకు తగు సూచనలు చేశారు.

విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న ఈఈ చిరంజీవి చిత్రంలో డీఈలు, అధికారులు

చుండూరు, న్యూస్‌టుడే: ఎవరైనా విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఈఈ చిరంజీవి తెలిపారు. విద్యుత్తు మీటర్ల తనిఖీలో భాగంగా చుండూరు మండల పరిధిలో 62 బృందాలతో 5,350 మీటర్లను తనిఖీ చేసినట్లు ఆయన శనివారం వివరించారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడిన నలుగురికి మొత్తం రూ.80 వేలు అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. అనుమతి లేని కేటగిరికి విద్యుత్తు వాడుకుంటున్న ముగ్గురికి రూ.14వేలు, అదనపు లోడు వాడుతున్న 148 మంది వినియోగదారులకు రూ.5.26లక్షలు అపరాధ రుసుము విధించామన్నారు. విజిలెన్స్ డీఈ వెంకటేశ్వరరావు, డీఈలు అశోక్‌కుమార్, ప్రసాద్, స్థానిక ఏఈ అర్జునరావు పాల్గొన్నారు.


27న జిల్లా, నగర అధ్యక్షులతో సమావేశాలు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ విభాగాలతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈ నెల 24 నుంచి సమావేశాలు నిర్వహించనున్నారని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో ఈ సమావేశాలు జరుగుతాయని చెప్పారు. దీనిలో భాగంగా 27న కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నాయకులతో షర్మిల సమావేశమవుతారు.

కౌలు రైతులకు రుణాలెక్కడ?

బాపట్ల, న్యూస్‌టుడే

కౌలు రైతులకు పంట రుణాల మంజూరు విషయంలో బ్యాంకులు కొర్రీలు వేస్తున్నాయి. రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగిపోయిన సాగుదారులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా పంటల సాగులోనూ నష్టాలు చవిచూసి రుణ ఊబిలో కూరుకుపోతున్నారు. రూ.లక్షల బకాయిలు చెల్లించలేక సాగుకు దూరమవుతున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం జారీ చేసిన సీసీఆర్సీ కార్డుల్లో ఖరీఫ్‌లో పది శాతం మందికి మాత్రమే బ్యాంకర్లు రుణాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. కనీసం రబీలోనైనా రుణాలు ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు.



లక్ష్యం ఘనం

జిల్లాలో 3.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. కౌలురైతులు లక్షన్నర మందికి పైగా ఉన్నారు. ఖరీఫ్‌లో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మరో 68 వేల ఎకరాల్లో మిరప, పొగాకు, కూరగాయలు, వేరుసెనగ, పసుపు, తోట పంటలు పండిస్తున్నారు. అధిక వర్షాలు, వరదలు, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిని అన్నదాతలు నష్టపోయారు. గత జూన్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కౌలురైతులకు కనీసం రూ.వంద కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు.

నెలల తరబడి ఎదురుచూపులే

ఖరీఫ్ సీజన్ ముగిసింది. సీసీఆర్సీ కార్డులు కలిగిన పది శాతం మంది కౌలు రైతులకే రుణాలిచ్చి సరిపెట్టేశారు. కౌలు రైతులను నెలల తరబడి బ్యాంకుల చుట్టూ తిప్పించుకున్నారు. రుణాలు ఇవ్వకుండా మొండి చేయి చూపారు. పంటల సాగుకు పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అన్నదాతలు అప్పులు చేశారు. భారీ వర్షాలకు పంటలు దెబ్బతినటంతో ధాన్యం దిగుబడులు తగ్గే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఖరీఫ్ పంటలు కలిసి రాలేదు. కనీసం రబీలోనైనా పంటలు బాగా పండితే బకాయిలు తీర్చగలమని సాగుదారులు అంటున్నారు. మొక్కజొన్న, అపరాలు, శనగ, వేరుసెనగ, దాళ్వా వరి సాగు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

రబీలోనైనా మంజూరుకు అన్నదాతల వినతి

వీరిని గుర్తించి రెవెన్యూ శాఖ ద్వారా సాగు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్సీ) జారీ చేశారు. సీసీఆర్సీ పత్రాల ద్వారా రాయితీపై విత్తనాలు, పంట నష్టం జరిగితే పరిహారం, బ్యాంకు రుణాలు ఇస్తామని ప్రకటనలు చేశారు. 88 వేల మందికి పైగా సీసీఆర్సీ కార్డులు ఇవ్వటంతో లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేస్తారని సాగుదారులు ఆశలు పెట్టుకున్నారు.

అదనపు కేటాయింపులు మేలు

కౌలు రైతులకు కనీసం మరో రూ.28 కోట్ల రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. రబీలో రుణాలు ఇచ్చినా సీసీఆర్సీ కార్డులు ఉన్న వారిలో సగం మందికి కూడా అందవు. మరో రూ.50 కోట్లు అదనంగా కేటాయించి రుణాలు మంజూరు చేస్తే తక్కువ వడ్డీకే పెట్టుబడి నగదు చేతిలో ఉండి రబీ పంటలు సాగు చేస్తారు. లేకుంటే మళ్లీ అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తుంది. రైతు కష్టం మొత్తం వడ్డీ వ్యాపారుల పాలవుతుంది. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి కౌలురైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

ఎక్కువ మందికి అందేలా చూస్తాం

సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు మంజూరు చేయిస్తాం. ఈ మేరకు అన్ని బ్యాంకర్లను ఆదేశిస్తా. రబీలో ఎక్కువ మందికి రుణాలు అందేలా చర్యలు తీసుకుంటాం. – శివకృష్ణ, ఎల్‌డీఎం

సత్తాచాటిన 'లక్ష్య' క్రీడాకారులు

చీరాల, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన దక్షిణ భారత



పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు

జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో చీరాల 'ఈనాడు' 'లక్ష్య' క్రీడాకారులు సత్తాచాటి రెండు పతకాలు సాధించారు. 16 సంవత్సరాల బాలుర విభాగం లాంగ్‌జంప్‌లో వి.యశ్వంత్‌రాజ్ కాంస్య, 20 సంవత్సరాల బాలికల విభాగంలో పి.మహాలక్ష్మి 4 400 మీటర్ల రిలేలో కాంస్య పతకం సాధించారని శిక్షకుడు పులుగు ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన వీరు పతకాలు సాధించటంపై స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

వేటపాలెం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.పుష్ప రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఫణి సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా త్రోవగుంట జడ్పీ హెచ్‌ఎస్‌లో శనివారం జరిగిన అండర్-17 వాలీబాల్ జిల్లా స్థాయి ఎంపికల్లో పుష్ప ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు చెప్పారు. బాలిక ఈనెల 21న సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. పుష్పను వ్యాయామోపాధ్యాయులు కోటేశ్వరమ్మ, శ్రావణిలు అభినందించారు.

హాకీ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లు సిద్ధం


జిల్లా జట్టుకు ఎంపికైన బాలికల జట్టు సభ్యులతో ఎస్‌జీఎఫ్ సభ్యులు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికల హాకీ జట్లను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.రవి, బాపట్ల జిల్లా కార్యదర్శి ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చెరువుజమ్ములపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 200మంది పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియను ఎంఈవో ప్రసాద్, డీఎస్‌డీవో పాల్‌కుమార్ ప్రారంభించారు. నవంబరు 2 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో అండర్-17 విభాగంలో బాల బాలికల జట్లు, 8నుంచి అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగే పోటీల్లో అండర్-14 జట్లు పాల్గొంటాయని స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కరీముల్లా తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శులు రమేష్, ప్రశాంత్, పల్నాడు, గుంటూరు జిల్లాల కో-ఆర్డినేటర్లు పిచ్చయ్య, గంగాధర్, పీడీలు వీరచంద్ర, భాస్కరరావు, ఆంజనేయులు, సాంబశివరావు, చినకాకాని భాస్కర్, వాణి, పాఠశాల హెచ్.ఎం కృష్ణారావు పర్యవేక్షించారు. అనంతరం జిల్లాస్థాయి జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.

అండర్-17 బాలుర జట్టు.. వై.శరత్, నరేష్, సిసింద్రీ, సాయిసుధీర్, సాత్విక్ (బాపట్ల), ఐజాక్ బాబు, వై.ఆదిత్య (నల్లపాడు), సర్దార్, వంశీకృష్ణ (యనమదల), శ్రీ నిశ్చల్ (బీఏసీ, బాపట్ల), ఎస్.డి.ఎం.డి అక్మల్ అషాజ్ హుస్సేన్, ఎల్.దేవుడు, ఆర్.చందునాయక్ (తెనాలి), పి.శౌరికిరణ్, గోపి, తేజ (నందిగామ), వై.వాసుదేవ్ (చింతాయపాలెం), బి.మోక్ష మణికంఠ (హిందూ హెచ్‌ఎస్), సాయి శ్రీరామ్ (బాపట్ల), ఎం.వెంకటేష్ (వెనిగండ్ల), బి.భాను (కర్లపాలెం).

అండర్-14 బాలుర జట్టు.. వి.రత్నం, బి.మణికంఠ, కె.సంపత్, ఎస్.జశ్వంత్, వి.విక్టర్‌పాల్, కె.సుదర్శన్, జె.వెంకటేష్ (బాపట్ల), టి.నవీన్ (చింతాయపాలెం), కె.మోహన్, టి.పార్థు (తెనాలి), ఎల్.పార్థసారథి, టి.షణ్ముక్, ఎ.భరత్‌కుమార్, వి.జయదీక్షిత్ (నల్లపాడు), వి.ఎస్.నాగఫణేంద్ర, టి.లక్ష్మీనారాయణ (యనమదల), టి.రత్నరాజు (చింతాయపాలెం), పి.బాలు (వెనిగండ్ల), ఎల్.హర్షవెంకట్ (ఎల్.ఎ. బాపట్ల), ఎల్.గణేష్ (కర్లపాలెం), పి.గణేష్ (తెనాలి).

అండర్-14 బాలికల జట్టు.. వైష్ణవి, మోహనగంగ, హతిలా (నల్లపాడు), సుప్రజ, ఝాన్సీ, వరలక్ష్మి, గౌతమి, జె.దివ్య, బి.దివ్య (సి.జె.పాలెం, బాపట్ల), నవ్య, యశస్వి (యనమదల), ఎ.అక్షిత (ముత్తాయిపాలెం), అమృత వర్షిణి (బాపట్ల), కీర్తన (ఎఎంజీ), షేక్.ఆయేషా (చింతాయపాలెం), హన్సిక (పెదకూరపాడు), చందన (తెనాలి), జె.భార్గవి (వెనిగండ్ల), ఉజ్వల (నల్లపాడు), ఐశ్వర్య (వెదుళ్లపల్లి), జి.భావన కోటేశ్వరి (సత్తెనపల్లి).


బాలుర జట్టుకు బహుమతులు ఇస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

అండర్-17 బాలికల జట్టు.. అనురాధ, మరియమ్మ, సుల్తానా, రేణుక, శాంతి, లోహిత (సి.జె.పాలెం, బాపట్ల), వందన, పి.హారిక, బి.యోగిత, యు.అక్షయ (నల్లపాడు), ప్రసన్నలక్ష్మి, శివబిందు, అంబిక (యనమదల), ఎం.శ్రీవల్లి (అడవులదీవి), కె.పావని, సాయిలక్ష్మి (చింతాయపాలెం), నిహారిక (డీఎస్‌వో), డి.శ్రీలక్ష్మి, (సత్తెనపల్లి), జశ్విత (ఎఎంజీ), ఎం.భావన (ఎల్.ఎ బాపట్ల), సుహానా (తెనాలి).

బాకీ చెల్లించాలంటూ ఆందోళన

వి.కొప్పెరపాడు(అద్దంకి), న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు చెల్లించాలంటూ బల్లికురవ మండలం కొప్పెరపాడు వాసులు ఆందోళన చేశారు. ఈ సంఘటన శనివారం ఉదయం గ్రామంలో జరిగింది. కొవిడ్ సమయంలో 20 మంది గ్రామస్థుల నుంచి సుమారు రూ.1.30 కోట్ల వరకు అప్పు చేసిన ఓ మహిళ తిరిగి చెల్లించలేదు. దీనిపై గ్రామస్థులంతా కలిసి ఆ మహిళ దుకాణం వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై జీవీ.చౌదరి ఇరువర్గీయులను బల్లికురవ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. బాకీ వసూలు చేసుకునేందుకు చట్టప్రకారం నడుచుకోవాలి గానీ చట్టవ్యతిరేక చర్యలు చేపట్టరాదని సూచించారు. ఋణదాత నుంచి వివరాలు సేకరించారు.

నేలకొరిగిన స్తంభం.. పొంచిఉన్న ప్రమాదం


కొంగపాడు సమీపంలో ఇలా..

అద్దంకి, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా విద్యుత్తు స్తంభాలు నేలకొరుగుతున్నాయి. మండలంలోని కొంగపాడు - బొడ్డువానిపాలెం రహదారి వెంబడి సుబాబుల్ తోటల్లోని స్తంభాలు నేలకొరిగాయి. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి వెంబడి ధేనువకొండ పునరావాస కాలనీ ఎదుట భారీ స్తంభాల పరిస్థితి ఇలాగే ఉంది. దీనిపై ఏఈ శివప్రసాద్‌ను వివరణ కోరగా వెంటనే మరమ్మతులు జరిపిస్తామన్నారు.

'జేఎన్‌టీయూ' స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాసరావు

వేటపాలెం, న్యూస్‌టుడే: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో వ్యాయామోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అన్నం శ్రీనివాసరావు జేఎన్‌టీయూ కాకినాడ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు ఉపకులపతి నుంచి ఉత్తర్వులు అందినట్లు కళాశాల ప్రధానాచార్యుడు కె.జగదీష్‌బాబు తెలిపారు. ఏడాది పాటు ఈయన ఇందులో కొనసాగనున్నారు. శనివారం కళాశాలలో జరిగిన అభినందన సభలో శ్రీనివాసరావును కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, మేనేజరు ఆర్వీ రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


శ్రీనివాసరావును అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2 కోట్లు

బాపట్ల, న్యూస్‌టుడే: అడవిపల్లెపాలెం తీరంలో మత్స్యకారులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.రెండు కోట్లు మంజూరైనట్లు మత్స్యశాఖ జేడీ సురేష్ తెలిపారు. అడవి పంచాయతీలో మత్స్యకారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మౌలిక సదుపాయాల కల్పనపై వారి నుంచి మత్స్యశాఖాధికారులు అభిప్రాయలు సేకరించారు. మత్స్యకారులు మాట్లాడుతూ జెట్టీ నిర్మించి పడవలు నిలపటానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈపూరుపాలెం స్ట్రైయిట్ కట్ మురుగుకాలువలో పూడిక తీయాలని, సోలార్ దీపాలు అందజేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, చేపలు ఎండబెట్టటానికి డ్రై ప్లాట్‌ఫారాలు నిర్మించాలని, ప్రథమ చికిత్స కిట్లు, అగ్నిమాపక పరికరాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యశాఖ ఏడీ సైదా, ఎఫ్‌డీవో రవీంద్ర, మత్స్య సహాయకులు మరియదాసు, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాగులు పొంగితే రాకపోకలు నిలిచినట్లే!

మార్టూరు, పర్చూరు, కారంచేడు(మార్టూరు), యద్దనపూడి, న్యూస్‌టుడే: వర్షాకాలం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల మధ్య ప్రజలు రాకపోకలు సాగించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి. తేలికపాటి జల్లులు కురిస్తే చాలు కాలువలు, వాగులు ప్రమాదకర స్థితిలో పొంగి ప్రవహించడమే దీనికి ప్రధాన కారణం. ఫలితంగా అత్యవసర సమయాల్లో, వైద్యసేవలకు వెళ్లాల్సిన రోగులు ప్రయాణాలను వాయిదా వేసుకోక తప్పడం లేదు. ఏళ్ల తరబడి ప్రజలు ఈ అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ప్రత్యేకదృష్టి సారించి అవసరమైన ప్రాంతాల్లో హైలెవల్ వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.


కారంచేడు మండలం స్వర్ణ -తిమిడెదపాడు గ్రామాల మధ్య చప్టాపై వరద నీరు

❖ యద్దనపూడి, మార్టూరు మండలాల్లో ఇటీవల కురిసిన వానలకు పోలూరు-చిలుకూరివారిపాలెం గ్రామాల మధ్య పర్చూరు వాగు వరద ఉద్ధృతికి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఇలా వచ్చినప్పుడల్లా మూడు నాలుగు రోజులపాటు రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అంతేకాక మండలకేంద్రం చేరుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొందటున్నారు. గతంలోనూ పోలూరు వద్ద వంతెనపైకి చేరిన వరదనీటిలో ఇద్దరు గల్లంతై, మృత్యువాత పడిన సంఘటనలు ఇప్పటికీ ఆప్రాంత ప్రజలు మరువకున్నారు. వింజనంపాడు- చిలుకూరివారిపాలెం, తనుబొద్దివారిపాలెం- చిమటావారిపాలెం, పూనూరు- చింతగుంటపాలెం గ్రామాల మధ్య ప్రవహించే వాగు చప్టాలపైకి నీరు చేరి పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

❖ పాతచెన్నై రహదారిలోని కారంచేడు మండలం దగ్గుబాడు వద్ద అలుగుపైకి వరదనీరు చేరిందంటే ఈమార్గంలో రాకపోకలకు అంతరాయం తలెత్తినట్లే. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోక తప్పడంలేదు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ దారిలో హైలెవల్ వంతెన నిర్మించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన మార్గమైన పర్చూరు- ఇంకొల్లు మధ్య దగ్గుబాడు వద్ద చప్టా స్థానంలో వంతెన నిర్మించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. పోతినవారిపాలెం- దగ్గుబాడు, స్వర్ణ- తిమిడెదపాడు వంటి గ్రామాల మధ్య చప్టాలపైకి వరదనీరు చేరడంతో రెండు మూడు రోజులపాటు ఆవైపు రాకపోకలు కష్టసాధ్యంగా మారుతున్నాయి. పోలీసులు ప్రాణనష్టం వాటిల్లకుండా ఆ సమయాల్లో పహారా ఉండాల్సిన పరిస్థితులు తప్పడంలేదు.

శ్రీనివాసరావు మృతిపై జ్యుడీషియల్ విచారణ చేయాలి

గడియారస్తంభం వద్ద ఆందోళనకారుల రాస్తారోకో... డీఎస్పీ హామీతో విరమణ

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వారం రోజుల క్రితం పాపాయిపాలేనికి చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను వాడరేవు-కీర్తివారిపాలెం సమీపంలో రోడ్డు ప్రమాదంలో చనిపోలేదని, అతన్ని హత్యచేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు కుట్ర జరిగిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, యాదవ సామాజిక వర్గీయులు, స్నేహితులు శనివారం స్థానిక గడియారస్తంభం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రీను మృతిపై జ్యుడీషియల్ విచారణతో పాటు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అందరితో ఐక్యతగా ఉండడమే కాకుండా ఆపదలో ఉన్నవారిని ఆదుకునే మనసున్న అతడ్ని ఒక పథకం ప్రకారం హత్య చేశారని ఆరోపించారు. విజయవాడ వరదల సమయంలో ఒక్కడే మూడువేల మందికి నిత్యావసర వస్తువులు అందజేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు దీనిపై స్పందించి తమకు న్యాయం చేయకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి అక్కడే సమస్య పరిష్కరించుకుంటామన్నారు. జిల్లా ఎస్పీ వచ్చి హామీ ఇస్తే తప్ప ఇక్కడ నుంచి వెళ్లే ప్రసక్తిలేదని రోడ్డుపైనే బైఠాయించారు. అంతకుముందు వాడరేవు బస్టాప్ వద్ద ఉన్న ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ విగ్రహానికి పూలమాల వేసిన ఆందోళనకారులు నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ గడియారస్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉదయం పదకొండున్నరకు ప్రారంభమైన ఆందోళన మధ్యాహ్నం రెండున్నర వరకు సాగింది. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొదటి పట్టణ, రెండో పట్టణ, గ్రామీణ సీలు ఎం.శ్రీనివాసరావు, నాగభూషణరావు, శేషగిరిరావు, వేటపాలెం, ఈపూరుపాలెం ఎస్సైలు వెంకటేశ్వర్లు, శివకుమార్‌లు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాజీ మంత్రి డాక్టరు పాలేటి రామారావు, గవిని శ్రీనివాసరావు, పులి వెంకటేశ్వర్లు, గుంటూరు మాధవరావు, సీతారామయ్య, వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాలకు చెందిన యాదవ సామాజిక వర్గీయులు, మహిళలు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులు

నాలుగు బృందాలు నియమించాం

ఈ కేసు దర్యాప్తునకు నాలుగు బృందాలను నియమించాం. చనిపోయిన వ్యక్తి చాలా మంచివాడని, ఎవరితో శత్రుత్వంలేదని మా విచారణలో తేలింది. పోలీసులతో స్నేహంగా ఉంటాడని మా సిబ్బంది చెబుతున్నారు. ఇలా జరగడం బాధాకరం. దీనిపై అన్ని రకాలుగా పరిశీలన చేస్తున్నాం. మీకు అనుమానాలు ఏమైనా ఉంటే వాటిని చెప్పండి. దీని వెనుక ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తిలేదు. దీనికి అందరు సహకరించాలని, రాబోయే మూడు రోజుల్లో ఈ సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తామని డీఎస్పీ చెప్పడంతో ఆందోళనకారులు రాస్తారోకో విరమించారు.

-జగదీష్ నాయక్, డీఎస్పీ, చీరాల

నీటి గుంతలో పడి బాలుడి మృతి

సంతమాగులూరు: కొప్పరం శివారు నెహ్రూనగర్ కాలనీలో 11 ఏళ్ల బాలుడు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎస్సై ఎం.పట్టాభిరామయ్యను వివరణ కోరగా బాలుడి మృతిపై ఎలాంటి లిఖితపూర్వక సమాచారం అందలేదన్నారు.

లండన్‌లో కలవకూరు వాసి మృతి

అద్దంకి, నూస్‌టుడే: అద్దంకి మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన గూడా బాబుల్‌రెడ్డి(40) లండన్‌లోని స్విండేనర్ ప్రాంతంలో గుండెపోటుతో మృతిచెందారు. ఈ సంఘటన ఈనెల 17న చోటుచేసుకుంది. భారత కాలమానం ప్రకారం ఆరోజు సాయంత్రం ఆరు గంటల సమయంలో అద్దంకిలో నివసిస్తున్న ఆయన తండ్రి గూడా మహాలక్ష్మిరెడ్డికి సమాచారం అందింది. మృతదేహాన్ని అద్దంకి తీసుకొచ్చేందుకు బుధ, గురువారం వరకు సమయం పడుతుందని ఆయన వెల్లడించారు. తండ్రి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్న బాబుల్‌రెడ్డి ఐబీఎం కంపెనీ ద్వారా లండన్‌కు పదేళ్ల క్రితం వెళ్లారు. మూడున్నర సంవత్సరాల క్రితం మరో కంపెనీకి మారారు. భార్య మల్లీశ్వరి, ఇద్దరు కుమారులు అనీష్‌రెడ్డి(9), జస్వంత్‌రెడ్డి(3) ఉన్నారు. ఆరోజు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన ఆయన అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మృతదేహాన్ని అద్దంకి తీసుకొచ్చేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న పలువురు అద్దంకి పోతురాజుగండిలో నివసిస్తున్న తండ్రి మహాలక్ష్మిరెడ్డిని ఓదారుస్తున్నారు.


బాబుల్‌రెడ్డి(పాతచిత్రం)

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 145, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

22న రైతుబజారు ప్రారంభం

బాపట్ల: పట్టణంలోని రైతుబజారును ఈ నెల 22న ప్రారంభిస్తున్నట్లు జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతుబజారులో దుకాణాలను రైతులు, పొదుపు సంఘాల మహిళలకు కేటాయిస్తామన్నారు. స్టాల్స్ కేటాయింపు విషయమై మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబును సంప్రదించాలని సూచించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

బాపట్ల: నందిరాజుతోట విద్యుత్తు ఉపకేంద్రంలో నూతన బ్రేకర్ ఏర్పాటు పనులు చేస్తున్నందున పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ సాయి శ్రీనివాస్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ పట్టణంలోని అక్బర్‌పేట, పురపాలక కార్యాలయం, తవ్వ కాల్వ, ఎస్‌ఎన్‌పీ అగ్రహారం, యాదవపాలెం, చీలురోడ్డు, శ్రీనివాసనగర్ కాలనీ, కలెక్టరేట్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

శుద్ధి చేసిన మురుగు నీటితో నష్టం లేదు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: శుద్ధి చేసిన మురుగునీటిని సాగుకు వినియోగిస్తే పొలాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని రేపల్లె తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె మండలం బేతపూడి గ్రామ సచివాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి శనివారం మాట్లాడారు. మురుగు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రేపల్లె మున్సిపాలిటీకి రూ.1.35 కోట్లు మంజూరు చేసిందన్నారు. పట్టణంలో మురుగు కాల్వల ద్వారా వచ్చే నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేసి పంటల సాగుకు వాడితే దిగుబడి తగ్గదని వివరించారు. కేంద్రం ఏర్పాటుకు అవసరమైన 1.30 ఎకరాల భూమిని అధికారులు పరిశీలించారు. కమిషనర్ సాంబశివరావు, శానిటరీ అధికారి రామచంద్రరావు, ఏఈ రోహిణి, కార్యదర్శి పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? నిజాంపట్నం-పాలరేవు మార్గంలో ముళ్లమొక్కలు ఏపుగా పెరిగి రహదారిపైకి వాలి ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదు. దీని వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సమస్య పరిష్కరించాలి.

- స్థానికుడు, నిజాంపట్నం

✔ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రహదారుల నిర్వహణలో భాగంగా పెరిగిన మొక్కలు తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- విద్యాసాగర్, ఏఈ, ఆర్అండ్‌బీ

- న్యూస్‌టుడే, నిజాంపట్నం

నిల్వ నీటిని తోడేశారు

స్పందనకు వందనం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ వెనుక రామకృష్ణ నగర్‌లోని సిమెంటు రోడ్లపై చిన్నపాటి వర్షం కురిసినా రోజుల తరబడి నీరు నిలుస్తోంది. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. రోడ్లపై స్థానికుల రాకపోకలకు ఇబ్బందులను ఈనెల 16న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు' అధికారుల దృష్టికి తెచ్చింది. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించారు. రోడ్లపై నిలిచిన నీటిని ఇంజన్లతో బయటకు తోడారు. సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి

మెరుగైన వసతుల కల్పనకు ఆదేశం

బాపట్ల, న్యూస్‌టుడే: బాలికా సదన్‌లో చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించాలని ఐసీడీఎస్ అధికారులను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి ఆదేశించారు. పట్టణంలోని బాలికా సదన్‌ను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ దస్త్రాలు, బియ్యం, కందిపప్పు, తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అందిస్తున్న భోజనం నాణ్యంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యకర వాతావరణంలో చిన్నారులు ఎదిగేలా చూడాలన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ ఉమ, బాలికా సదనం పర్యవేక్షకురాలు సుబ్బులక్ష్మి, డీసీపీవో పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

బాపట్ల, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు వ్యాపార యూనిట్లు విజయవంతంగా నిర్వహించి వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయశాలను ఆయన శనివారం ప్రారంభించారు. వేగేశన మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు వ్యాపారం చేయటానికి ప్రభుత్వం రాయితీపై రుణాలు మంజూరు చేస్తోందన్నారు. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, తెదేపా పట్టణాధ్యక్షుడు శ్రీనివాసరావు, సీఎంఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


స్టాల్‌లో ఉత్పత్తులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

గజిబిజి.. గందరగోళం

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

జాతీయ రహదారి అభివృద్ధి పనులు పూర్తయినా చెరుకుపల్లిలో వాహనదారులకు సమస్యలు తప్పడం లేదు. జిల్లాలో జాతీయ రహదారి చెరుకుపల్లి గ్రామం మీదుగా వెళుతోంది. దీంతో ఇక్కడ స్థానికులు, ఇతర గ్రామాల నుంచి వచ్చే వాహనదారులతో రహదారి రద్దీగా మారుతోంది. ఐలాండ్ కూడలి వద్ద తెనాలి మార్గంలోకి వెళ్లేవారు, అటు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే వారితో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహం తొలగింపులో ప్రతిష్ఠంభనతో దీని చుట్టూ 25 మీటర్ల వరకు మట్టి రోడ్డే ఉంది. దీంతో గుంతలు ఏర్పడటం, ఒంగోలు నుంచి మచిలీపట్నం వెళ్లే వాహనాలు విగ్రహం చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడం సమస్యగా ఉంది. ఈ సమయంలో తెనాలి - రేపల్లె మధ్య రాకపోకలు చేసేవారితో ఇక్కడి కూడలి గజిబిజిగా మారుతోంది. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఎన్నాళ్లు ఈ సమస్యలని వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట యూటర్న్ తీసుకుంటూ జాతీయ రహదారిపై అడ్డంగా నిలిచిన ఆర్టీసీ బస్సు

ట్రాఫిక్ పద్మవ్యూహంలో తీర ప్రాంత వాణిజ్య కేంద్రం

కానరాని నిబంధనల అమలు

వన్‌వేలోనూ సమస్యలే

చెరుకుపల్లి లూథర్‌పేట నుంచి పొన్నపల్లి వరకు దాదాపు 2.5 కి.మీ మేర అధికారులు జాతీయ రహదారిపై రోడ్డు విభాజకాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 5 చోట్ల మాత్రమే డివైడర్ మధ్యలో రోడ్డు దాటేందుకు, యూటర్న్ తీసుకునేందుకు ఖాళీ ఇచ్చారు. వాహనదారులు కొద్ది దూరానికి కూడా చుట్టూ తిరిగి రావడం ఎందుకని వన్‌వేలోనే నిబంధనలకు అనుగుణంగా వచ్చే వాహనాలకు ఎదురు వెళుతున్నారు. దీంతో తరచూ వాహనాలు ఢీకొని అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తెనాలి నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు తిరిగి తెనాలి వెళ్లాలంటే బస్సును వెనక్కు తిప్పడానికి సరైన ప్రాంతం లేక చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోని డివైడర్ మధ్య ఖాళీలో యూటర్న్ తీసుకునే సమయంలో బస్సు ఆగిపోయి జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఇలాంటి సమస్యలకు అధికారులు పరిష్కారం చూపాలని చోదకులతో పాటు, ప్రజలు కోరుతున్నారు.


తెనాలి మార్గంలోకి తిరుగుతున్న ఆటో

అవగాహన కల్పిస్తాం

చెరుకుపల్లిలో జాతీయ రహదారిపై రాంగ్ రూటులో వచ్చే వారిని గుర్తించి జరిమానా విధిస్తున్నాం. ఐలాండ్ కూడలిలో సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాం. అందువల్ల చాలా వరకు సమస్యలు తగ్గాయి. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తాం.

- టి.అనిల్‌కుమార్, ఎస్సై, చెరుకుపల్లి


అత్యంత ప్రమాదకర ప్రాంతం చెరుకుపల్లి ఐలాండ్ కూడలి (నిత్యం ఇక్కడ తేలికపాటి నుంచి తీవ్ర గాయాలయ్యే ప్రమాదాలు ఒకట్రెండు జరుగుతున్నాయి)

చెరుకుపల్లిలో రోడ్డు విభాజకం పొడవు **2.5 కి.మీ**

విభాజకాల మధ్య యూటర్న్ పాయింట్లు - **5**

నిత్యం జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు (దూరప్రాంతాలవి) **దాదాపు 1160 నుంచి 1280 వరకు**

స్థానిక వాహనాలు **3వేల నుంచి 4500 వరకు**

రద్దీ తీవ్రత
ఉదయం గంటకు 350 పెద్ద వాహనాలు
500 స్థానిక వాహనాలు
సాయంత్రం గంటకు
600 నుంచి 700
1200కు పైగా స్థానిక వాహనాలు

ప్రమాదకర ప్రాంతాలు
ఐలాండ్ కూడలి, కోరి సెంటర్, ఖాదర్‌ఖాన్ సెంటర్

మాతృభాషపై పట్టు అవసరం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మాతృభాషపై పట్టు సాధిస్తే ఇతర భాషల్లో నైపుణ్యం సాధించడం సులభమవుతుందని వక్తలు అన్నారు. గుర్రం జాషువా సాహిత్యం, రచనలు, పఠనాసక్తి, భాషా వికాసంపై రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు భీమయ్య మాట్లాడుతూ విద్యార్థులు జాషువా సాహిత్యం, రచనలు చదివి సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు, రచనాశక్తి, తెలుగు భాషపై పట్టు పెంచుకునేలా దృష్టి సారించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, అధ్యాపకులు అనిల్‌కుమార్, నరసయ్య, దాసు పాల్గొన్నారు.

బాపట్ల ఆర్టీసీ డీఎంగా శ్రీమన్నారాయణ



బాపట్ల: బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బి.శ్రీమన్నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కనిగిరి డిపో నుంచి బదిలీపై ఆయన బాపట్ల వచ్చారు. కొత్త డీఎం మాట్లాడుతూ కొత్త బస్సులు డిపోనకు కేటాయించేలా చూస్తానన్నారు. దూర ప్రాంతాలకు సర్వీసులు ప్రారంభించేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి దాత చేయూత

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: మండలంలో పేటేరు బీసీ-1 అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి వైద్యుడు ఆకురాతి వెంకట సుబ్బారావు రూ.10 వేల విలువైన కుర్చీలు, ఆట బొమ్మలు బహూకరించారు. దాత ఇచ్చిన ప్రోత్సాహంతో పిల్లలకు పూర్వప్రాథమిక విద్య అందించేందుకు మరింత ఉత్సాహంగా కృషి చేస్తానని కార్యకర్త వాణి శనివారం తెలిపారు.

తెదేపా పాలనలో పల్లెకు వెలుగు

భట్టిప్రోలు, అమృతలూరు, బలుసుల పాలెం (చెరుకుపల్లి గ్రామీణ), నగరం, పిట్ట లవానిపాలెం, బాపట్ల పట్టణం, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. [illegible] పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో ఆయన పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, [illegible] సర్పంచి దారా కిరణ్మయి, పార్టీ నాయకులు [illegible] ఎస్.వి.రమణ, శేషమాంబ, [illegible] తెదేపా నేతలు పాల్గొన్నారు. [illegible] చెరుకుపల్లి మండలం బలుసులపాలెం, నగరం మండలం సిరిపూడిలో తెదేపా నేత అనగాని శివప్రసాద్ [illegible] పనులకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి కొనకళ్ల మల్లేశ్వరి, [illegible] కొనకళ్ల రవికిరణ్ పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం మండలం [illegible] పిట్టలవానిపాలెం గ్రామాల్లో నిర్మాణం [illegible] ఇన్‌ఛార్జి ఎంపీపీ సీతారామరాజు [illegible] పాల్గొన్నారు. రేపల్లె మండలం [illegible] రూ. 30 లక్షల ఉపాధి నిధులతో [illegible] శంకుస్థాపన చేశారు. [illegible] వడ్డి లక్ష్మోజి పాల్గొన్నారు. బాపట్ల మండల పరిధిలోని మూలపాలెం, పడమర బాపట్ల పంచాయ[illegible] తీల్లో శ్మశాన వాటిక, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. [illegible] మాట్లాడుతూ అభివృద్ధి పనులు [illegible] సమస్యలు ఉంటే ప్రజలు తెలియజేయాలన్నారు. సర్పంచి అనిల్ తెదేపా నాయకులు పాల్గొన్నారు.


భట్టిప్రోలు: భూమి పూజలో ఎమ్మెల్యే ఆనందబాబు


చెరుకుపల్లి: బలుసులపాలెంలో శంకుస్థాపన చేస్తున్న శివప్రసాద్


పి.వి.పాలెం: శంకుస్థాపన చేస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీపీ సీతారామరాజు

మోదుకూరు దుర్గమ్మకు పూజలు

చుండూరు, న్యూస్‌టుడే: మండలంలో మోదుకూరులోని కనకదుర్గమ్మకు భక్తులు శనివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రోజులపాటు పూజలు చేసి, కుంభం పోసి, గుమ్మడి కాయతో బలహార్పణం చేసి, గుడి తలుపులను మూసేశారు. దసరా రోజున ఇక్కడ గుడి తలుపులు మూసే ఉంటాయి. మళ్లీ తొమ్మిదో రోజున తలుపులు తెరిచి ప్రత్యేక పూజులు చేశారు. అనివార్య కారణాలతో పండుగ చేసుకోని గ్రామస్థులు తిరుగు దీపాల పేరుతో అమ్మవారికి పూజలు చేయడం ఇక్కడ ఆనవాయితీ.


హారతి తీసుకుంటున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

అయ్యప్ప మాలధారులకు సద్ది ప్రారంభం

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలో గుళ్లపల్లి శ్రీరామమందిరం వద్ద అయ్యప్ప, ఇతర దీక్షలు స్వీకరించిన వారికి సద్ది కార్యక్రమం ప్రారంభమైంది. నాగ్ యూత్, అనగాని యువసేన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. తెదేపా నేతలు వంగర శ్రీనివాసరావు, కోటా భార్గవ్ 5 బస్తాల బియ్యాన్ని శనివారం విరాళంగా అందించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు, నేతలు వంగర శ్రీనివాస చక్రవర్తి, కాటూరి ఏడుకొండలు, కాటూరి అంజి, మోర్ల లక్ష్మణ్ తదితరులు పర్యవేక్షించారు.

బీరువా బహూకరణ

పెద్దవరం(నగరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమని పెద్దవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బదరీనారాయణ అన్నారు. బాపట్లకు చెందిన కృష్ణసాయి, దీపిక దంపతులు సుమారు రూ.20వేల విలువైన ఇనుప బీరువాను పాఠశాల యాజమాన్యానికి శనివారం అందించారు.

రేషన్ సక్రమంగా అందించండి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : రేషన్ సరకులను అర్హులకు సక్రమంగా అందించాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు షేక్ సలీమా సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లు, వీఆర్వోలతో సమీక్షా సమావేశాన్ని ఆమె శనివారం నిర్వహించారు. అవకతవకలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణ, మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 13 రేషన్ దుకాణాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు పక్కాగా చేయాలని సూచించారు. సీఎస్‌డీటీ ఫణికుమార్, పలువురు రేషన్ డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వరాహాలకు నిలయంగా బస్టాండ్


ఖాదర్‌ఖాన్ సెంటర్ సమీపంలో బస్‌షెల్టర్ చుట్టూ చేరిన మురుగునీరు

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల కేంద్రం చెరుకుపల్లిలో ఖాదర్‌ఖాన్ సెంటర్ సమీపంలో దాతలు అందించిన స్థలంలో ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్ నిర్మించారు. గతంలో ఇక్కడకు తెనాలి, గుంటూరు, బాపట్ల, రేపల్లె బస్సులు వచ్చేవి. బస్టాండ్ ప్రాంతం పల్లంగా మారడం వ్యర్థాలకు నిలయంగా మారడంతో బస్సుల రాకపోకలు నిలిచాయి. దశాబ్దాలుగా ఇది నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం వరాహాలకు నిలయమైంది. దీని తలరాత ఎప్పుడు మారుతుందో అని చెరుకుపల్లి వాసులు ఎదురుచూస్తున్నారు.

చెరువుకు కంచె వేస్తున్నారని ఫిర్యాదు

బాపట్ల పట్టణం: గ్రామంలో చెరువు, రోడ్లు తమ పూర్వీకులకు చెందినవని ఎవరూ చెరువులో దిగొద్దని గ్రామానికి చెందిన వేల్పూరి ధర్మారావు, అతని కుటుంబ సభ్యులు చెరువుకు కంచె వేస్తున్నారని మండల పరిధిలో జిల్లెళ్లమూడి గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి ఎ.నాగలక్ష్మికి శనివారం ఫిర్యాదు చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అల్లర్లు చేసేందుకు యత్నిస్తున్నారని వారు పేర్కొన్నారు. గ్రామస్థుల ఫిర్యాదును పంచాయతీ కార్యదర్శి వెదుళ్లపల్లి పోలీసులకు అందచేశారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని వెదుళ్లపల్లి ఎస్సై పి.జనార్దనరావు తెలిపారు.

ఆటో ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థికి గాయాలు

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి జె.ప్రశాంత్‌కుమార్ కళాశాల ముగిసిన తర్వాత ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా పట్టణంలో రిలయన్స్ మాల్ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాలైన విద్యార్థిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.


నిజాంపట్నం: జలమయం అయిన మొగదారమ్మ కాలనీ


నిజాంపట్నం: యూనియన్ బ్యాంకు ఎదురు రహదారి ఇలా

తీరంలో కుండపోత వర్షం

వేమూరు, కొల్లూరు, నిజాంపట్నం, నగరం, న్యూస్‌టుడే: రెండ్రోజులుగా తీర ప్రాంత మండలాల్లోని గ్రామాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచే పలుచోట్ల వర్షం కురిసింది. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రైతులకు భారీ వానలు వణుకు పుట్టిస్తున్నాయి. వేమూరు మండల పరిధిలో కురిసిన కుండపోత వర్షంతో పలు రోడ్లు కాల్వలను తలపించాయి. వేమూరు, జంపని కొత్త కాలనీల్లో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. జంపని 14వ వార్డు బీసీ కాలనీలో నీరుచేరడంతో పంచాయతీ ఆధ్వర్యంలో పొక్లెయిన్ సాయంతో కాల్వలో పూడిక తీయించి నీటిని బయటకు పంపారు. కొల్లూరుతో పాటు గ్రామాల్లో పలు చోట్ల రహదారులు, కొన్ని చోట్ల నివాసాలు జలమయమయ్యాయి. స్థానిక వెంకటేశ్వర సినిమా హాలు నుంచి జెండా చెట్టు వరకు నీరు నివాసాల్లోకి చేరడంతో స్థానికులు బైపాస్ రోడ్డుకు గండి కొట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిజాంపట్నం మండల కేంద్రంలో మొగదారమ్మ కాలనీలో ఇళ్లు, అంతర్గత రహదారులపైకి నీరు చేరి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. యూనియన్ బ్యాంకు ఎదురు సంతబజారు రోడ్డు, కోస్టుగార్డు స్టేషన్ ఎదురు రేపల్లె-నిజాంపట్నం ప్రధాన రహదారులు, లైన్స్ కాలనీ రోడ్లు చెరువులను తలపించాయి.


వేమూరు: జంపనిలో ఓ వీధిలో నీటి మళ్లింపు యత్నం


కొల్లూరులో బైపాస్ రోడ్డుకు స్థానికులు కొట్టిన గండి

విద్యార్థులకు పోషకాహారం పంపిణీ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : మండలంలో పెసర్లంక, పెదలంక గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంకల్పం ఫౌండేషన్ అధ్యక్షురాలు కె.ఎన్.శిరీష ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు, స్టేషనరీ సామగ్రిని శనివారం అందించారు. విద్యార్థులు పోషకాహారం తినాలనే ఉద్దేశంతో అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.కె.మహబూబ్ బాషా, బి.సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి

నేడు సరఫరా పునరుద్ధరణ

ఈనాడు కథనాలకు స్పందన

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో చిల్లరగొల్లపాలెం వద్ద దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్‌కు పురపాలక ఇంజినీరింగ్ సిబ్బంది శనివారం మరమ్మతులు పూర్తి చేశారు. మరమ్మతుల కారణంగా పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపిపోయింది. సాయంత్రానికి మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. ఆదివారం ఉదయం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామని పురపాలక అధికారులు తెలిపారు.

రహదారిపై గుంతలు పూడ్చారు

బాపట్ల, న్యూస్‌టుడే: మండలంలో ఈతేరు-గుడిపూడి పంచాయతీరాజ్ రహదారి కుంగి గోతులతో నిండి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న ఓ నీళ్ల ట్యాంకరు శుక్రవారం బోల్తా పడింది. దీనిపై 'నీళ్ల ట్యాంకరు బోల్తా' శీర్షికన ఈనెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారిపై పెద్ద గోతులను మెటల్‌తో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు.


రహదారిపై పూడ్చిన గుంతలు

? అద్దంకిలో కుక్కల బెడద పెరిగిపోయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం వెళ్లే వారిని వెంటాడుతున్నాయి. తక్షణం వీటిని నియంత్రించాలి.
-సత్యనారాయణ, శ్రీనివాసరావు, అద్దంకి

✔ దర్శి, అద్దంకి పురపాలక సంఘాల ఆధ్వర్యంలో కుక్కల్ని పట్టుకుని శస్త్రచికిత్స చేయించేందుకు రంగం సిద్ధమవుతుంది. పది రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నాం. ప్రజలు సహకరించాలి. **- డి.రవీంద్ర, పురపాలక కమిషనర్, అద్దంకి**

? అభ్యుదయనగర్‌లో కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు బురదమయంగా మారుతుంది. విద్యార్థులు, గృహాల వారు ఇటు వైపు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. తక్షణం కొండ మట్టి తోలి చదును చేయాలి. **- సుబ్బారావు, అద్దంకి**

✔ రూ.పది లక్షలతో తీర్మానం చేశాం. వారం రోజుల్లో కొండమట్టి తోలి రహదారుల్ని బాగు చేయనున్నాం.
- డి.రవీంద్ర, పురపాలక కమిషనర్, అద్దంకి

అద్దంకి, న్యూస్‌టుడే

